




# కరపత్రం

SINCE 2014

ఆదివారం జూలై 12, 2026 సంపుటి : 2 సంచిక : 270 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


## భారత్-న్యూజిలాండ్ బంధం

# మరింత బలోపేతం

- ఈ ప్రయాణం మున్ముందు మరింత విజయవంతమవుతుంది
- ప్రవాస భారతీయులు కృషి ఇందుకు ప్రధాన కారణం
- న్యూజిలాండ్ పర్యటనలో ప్రవాస భారతీయులతో మోడీ

**ఆక్లాండ్,జులై 1 :**
భారత్-న్యూజిలాండ్ వాకా(బోటు) ఇప్పుడు నూతన ప్రయాణాన్ని ఆరంభిం చేందుకు సిద్ధంగా ఉందని, ఇరు దేశాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం కానుందని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రయాణం మున్ముందు మరింత విజయవంతమవుతుందనే పూర్తి నమ్మకం తనకుందన్న మోదీ.. అది తనవల్ల కాదని, అందుకు న్యూజిలాండ్‌లోని భారతీయులే కారణమన్నారు. న్యూజిలాండ్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ రెండో రోజు పర్యటన కొనసాగింది. శనివారం ఆక్లాండ్‌లో ఆయన ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు స్నేహం, విశ్వాసం, విలువలు, బలమైన భవిష్యత్తు కోసం పరస్పర నిబద్ధతపై నిర్మితమయ్యా యని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు మోదీ. న్యూజిలాండ్ సంప్రదాయంలో విశిష్ట స్థానం కలిగిన 'వాకా'ను గురించి ప్రస్తావిస్తూ.. 'అదో పడవ మాత్రమే కాదని, ఉమ్మడి ప్రయాణానికి



2లో..

చిహ్నం' అని పేర్కొన్నారు. ఆక్లాండ్ నుంచి వెల్లింగ్టన్ వరకు, క్రైస్ట్‌చర్చ్ నుంచి క్వీన్స్‌టౌన్ వరకు విస్తరించి ఉన్న భారతీయ సమాజమే ఈ స్వర్ణయుగ ప్రయాణానికి నిజమైన నావికులని కొనియాడారు.

## కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయడం కుదరదు

# మేడిగడ్డ గేట్లు ఎత్తే ఉంచాలని ఎన్‌డిఎస్ఎ ఆదేశాలు

- గేట్లు మూస్తేనే నీరు ఎత్తి పోయడానికి అవకాశం
- గేట్లు మూస్తే ప్రాజెక్ట్ కొట్టుకు పోతుందని హెచ్చరిక
- ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఈటెల వ్యాఖ్యలు
- బిఆర్ఎస్ నేతల సూచనలతోనే మాట మార్చిన ఈటెల
- జలశక్తి మంత్రిత్వ శాఖను కలిసి అనుమతి తెస్తే అభ్యంతరం లేదు
- ఈటెల, బిఆర్ఎస్ నేతలకే నిర్వహణ బాధ్యత అప్పగిస్తా
- మీడిమయా సమావేశంలో సిఎం రేవంత్ స్పష్టీకరణ



**హైదరాబాద్,జులై11 :**
కాళేశ్వరం విషయంలో తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టాలని బీజేపీ నేతలు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మాజీమంత్రి హరీశ్‌రావు సూచనల మేరకే ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఎంపీ ఈటల అవాస్తవాలు చెప్పారని ధ్వజమెత్తారు. ఎంపీ ఈటల అంటే తమకు గౌరవమేనని తెలిపారు. ఆ వ్యాఖ్యలతో ఈటల తన గౌరవం పోగొట్టుకున్నారని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకే తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు.
శనివారం మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ప్రజలను తప్పుదోవ పట్టించేలా బిఆర్ఎస్ నేతలు, ఎంపి ఈటెల చేస్తున్న ప్రకటనలు దారుణమని అన్నారు. డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఎన్‌డిఎస్ఎ ఇచ్చిన నివేదిక, ఆదేశాల మేరకు తాము నడుచుకుంటున్నామని స్పష్టం చేశారు. కేంద్రంలో పలుకుబడి ఉన్న బిజెపి ఎంపిగా ఈటెల రాజేందర్ జలశక్తి మంత్రిత్వ శాఖను కలిసి, ఎన్‌డిఎస్ఎ ఆధ్వర్యంలో కాళేశ్వరం నీటిని ఎత్తి పోస్తే తమకు అభ్యంతరం లేదని తేల్చి చెప్పారు. ఎన్‌డిఎస్‌ను కలసి నీటిని ఎత్తి పోసేందుకు అనుమతి తెస్తే అందుకు ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం ఉండబోదన్నారు. ఎన్‌డిఎస్ఎ ఆదేశాల మేరకు మేడిగడ్డ గేట్లు ఎత్తే ఉంచామని అన్నారు. మేడిగడ్డ గేట్లు మూస్తేనే కన్నెపల్లి వద్ద పంపులు నడపడానికి వీలుంటుంద న్నారు. అలా కాకుండా పారుతున్న నీటని ఎత్తిపోయడం సాధ్యం కాదన్నారు. ఇకపోతే పట్టిసీమ కోసం నీటిని వదులుతున్నామని చేస్తున్న ఆరోపణలపైనా సిఎం మండిపడ్డారు. పోలవరం పూర్తి చేసుకునే వరకు పట్టిసీమను కట్టుకున్న విషయం ఆనాటి మంత్రి హరీష్ రావుకు తెలియదా అన్నారు. కావాలనే బురదజల్లే ప్రయత్నాలు చేయడంపై మండిపడ్డారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో నీటిని ఎత్తి ప ఓయడం కుదరదని సిఎం తేల్చారు. ఒకవేళ గేట్లు మూస్తే భద్రాచలం వరకు ముంపు తప్పదని ఎన్‌డిఎస్ఎ తెలిపిందని అన్నారు. కేసీఆర్ హయాంలో 2019 జూన్ 21వ తేదీన కాళేశ్వరం ప్రారంభించాక, కేసీఆర్ హయాంలోనే మేడిగడ్డ లోపాలు బయటపడ్డాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ప్రారంభించిన 11 నెలల్లోనే లోపాలు బయటపడ్డాయని చెప్పుకొచ్చారు.

మిగతాద్ది 2 లో



2 లో

## సెమీకండక్టర్ రంగంలో

# మరో కీలక ముందడుగు

- హైదరాబాద్‌లో తొలి సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ హబ్
- టీ-వర్క్స్‌లో హబ్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్,జులై 1 :**
సెమీకండక్టర్ రంగంలో తెలంగాణ రాష్ట్రం మరో కీలక ముందడుగు వేసింది. దేశంలోనే తొలి సీఎంపీ కెమికల్ మెకానికల్ పాలిషింగ్ ప్యాడ్ టెక్నాలజీ హబ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. టీ-వర్క్స్‌లో ఏర్పాటు చేసిన ఈ హబ్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు శనివారం ప్రారంభించారు. జపాన్‌కు చెందిన తోహో కోకి సంస్థ సాంకేతిక సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



## కావాలనే కన్నెపల్లి పంపులు తెరవడం లేదు

- మరోమారు ప్రభుత్వంపై హరీష్ రావు ఆరోపణలు

**సిద్దిపేట,జులై11 :**
ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నది కాలం తెచ్చిన కరువు కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కుటిల బుద్ధితో తెచ్చిన కరువు అని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు.



2లో..

## సిఎం రేవంత్‌తో ఎమిరేట్స్ ప్రతినిధుల భేటీ

- విమాన సర్వీసులను పెంచాలని కోరిన సిఎం

**హైదరాబాద్,జులై 1 :**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమిరైట్స్ వైమానిక సంస్థ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సార్ధన్ శనివారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎంతో చర్చించారు. ఎమిరైట్స్ వైమానిక సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సీఎంను మర్యాదపూర్వకంగా ఎమిరైట్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కలిశారు.

## షాబాద్ పరిధిలో కనీవినీ ఎరుగని దారుణం

# ఆరుగురని దారుణంగా హత్య చేసిన సైకో



మిగతాది 2లో

- ఫోక్సో కేసు పెట్టారని ముగ్గురి హత్య
- విచిత్రంగా భార్యా ఇద్దరు పిల్లల నరికివేత
- అనంతరం గ్రామం నుంచి పరార్
- నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు
- సైకోను పట్టుకోవాలంటూ గ్రామస్థుల ఆందోళన

**రంగారెడ్డి,జూలై11 :**
రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. పోక్సో కేసులో జైలు నుంచి వచ్చిన ఓ కిరతాకుడు నరమేథం సృష్టించాడు. ఏకంగా ఆరుగురిని దారుణంగా నరికి చంపాడు. ఆరుగురు హత్యకు గురైన ఘటన కలకలం సృష్టించింది. షాబాద్ మండల కేంద్రంలోని దైవాలగూడలో శు క్రవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్‌కుమార్ (28) అనే దుర్మార్గుడు ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్ కుమార్ కట్టుకున్న భార్య, ఇద్దరు కుమారులతో పాటు, తనపై పోక్సో కేసు పెట్టిన మైనర్ బాలిక, ఆమె తల్లి లక్ష్మీ, నాయనమ్మ రుక్కమ్మలను కత్తితో నరికి చంపాడు. మొదట షాబాద్ పీఆర్ఆర్ స్టేడియం సమీపంలో ఉన్న మైనరు బాలిక (17)ఇంట్లోకి ప్రవేశించి.. ఆమెను బలవంతంగా లాక్కెళ్లే క్రమంలో బాలిక తల్లి, నాయనమ్మ అడ్డు పడ్డారు. నిందితుడు వారిద్దరినీ కత్తితో పొడిచి చంపాడు. అనంతరం బాలికను దైవాల గూడ సమీపంలోని అఖిల్ సాగర్ చెరువు సమీపంలోకి తీసుకెళ్లి పీక కోసి హత్య చేశాడు. అనంతరం దైవాలగూడలోని తన ఇంటికొచ్చి భార్య సరిత (33)తో పాటు ఇద్దరు కుమారులు పరీక్షిత్ (4), దైవీక్షిత్ (2)లను కత్తితో పీకలు కోసి దారుణంగా హతమార్చాడు. ఆ తర్వాత తండ్రి అరుణ్ కుమార్‌కు ఫోన్ చేసి నేనే ఆరుగురిని చంపాను, నేను కూడా చనిపోతున్నానని చెప్పాడు.




# బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా తెలంగాణ

- హైదరాబాద్, చెన్నై, బెంగళూరును కలుపుతూ కారిడార్
- దేశంలో 7 బుల్లెట్ ట్రైన్లకు మూడు తెలంగాణకే
- దేశ వ్యాప్తంగా 1,300 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ
- ఇప్పటికే 260 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పూర్తి
- వికసిత్ భారత్-2047.. సాంకేతికత పాత్ర అంశంపై అశ్వినీ వైష్ణవ్

2 లో

**హైదరాబాద్,జులై 1 :**
తెలంగాణకు రైల్వే బడ్జెట్‌ను కేంద్రం భారీగా పెంచిందని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తెలంగాణ బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా మారబోతోందని అన్నారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో వికసిత్ భారత్-2047.. సాంకేతికత పాత్ర' అనే అంశం నిర్వహించిన సదస్సులో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్, చెన్నై, బెంగళూరును కలుపుతూ బుల్లెట్ ట్రైన్లు రానున్నాయని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఏపీకి ఇచ్చిన రైల్వే బడ్జెట్ రూ.880 కోట్లు మాత్రమే.. మోదీ సర్కార్ కేవలం తెలంగాణకే రూ.5వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు.



2లో..

## కాలం తెచ్చిన కరువు కాదు...

# కాంగ్రెస్ కరువు

- గోదావరిలో నీళ్లు ఉన్నా ఉపయోగించుకోని దరిద్రం
- కావాలనే నీటిని వృధాగా వదులుతున్నారు
- మీడియా సమావేశంలో మరోమారు కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్,జులై11 :**
ఇది కాలం తెచ్చిన కరువు కాదు కాంగ్రెస్ తెచ్చిన కరువు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ..

# కాలం తెచ్చిన కరువు కాదు... కాంగ్రెస్ కరువు

మొదటి పేజీ తరువాయి
2022 వరదల ఫోటోలు చూపి కన్నెపల్లి మునిగిందని అడ్డమైన మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒకవైపు నీళ్లు లేక రైతులు ఏడుస్తుంటే.. రేవంత్ రెడ్డి ఏమో మా మీద కోపంతో నీళ్లు ఉన్నా కూడా ఇవ్వడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఎక్కడా నీళ్లు లేకపోయినా కన్నెపల్లిలో మాత్రం నీళ్లు ఉన్నాయని.. మేడిగడ్డను ముట్టకుండా కన్నెపల్లి నుండి అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి, మిడ్ మానేరు అన్ని జలాశయాలు నింపొచ్చునని కేటీఆర్ వివరించారు.
రిటైర్డ్ ఇంజనీర్ల నివేదిక చూసి అయినా సోయి తెచ్చుకో రేవంత్ రెడ్డి అని కేటీఆర్ హితవు పలికారు. మేడిగడ్డ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ నుండి నీళ్లు లిఫ్ట్ చేయవచ్చు అని రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసింది. కన్నెపల్లి వద్ద ప్రస్తుతం 96.79 మీటర్ల నీళ్లు ప్రవహిస్తున్నాయి, కానీ 94 మీటర్లకే పంపులు ఆన్ చేయవచ్చు. మరో 100 రోజులు కన్నెపల్లి వద్ద ఇదే తరహా ప్రవాహం ఉంటుంది. 100 రోజుల్లో రోజుకి 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీల లిఫ్ట్ చేస్తే, గోదావరి బేసిన్లో ఉన్న అన్ని రిజర్వాయర్లు నింపి సస్యశ్యామలం చేసే అవకాశం ఉందని ప్రభుత్వానికి రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసిందన్నారు. మా మీద కక్షతో రైతుల నోట్లో మట్టి కొట్టకు.. కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేసే కుట్రలో రైతులకు నీళ్లు ఇవ్వకుండా వాళ్లని ఆగం చేయకు రేవంత్ రెడ్డి అని కేటీఆర్ కోరారు.
గోదావరిలో కళ్ల ముందు లక్ష క్యూసెక్కుల నీళ్లు వరదలాగా కిందకి పోతుంటే అక్కడ ఎత్తిపోయడానికి నీళ్లు లేవు అన్నవాడు బుద్ధితక్కువ వాడా..? లేదా రైతుల కోసం ఈ పని చేయమన్నోడు బుద్ధితక్కువ వాడా..? అని కేటీఆర్ అన్నారు. కన్నెపల్లి వద్ద 93 మీటర్ల నుండే నీళ్లు ఎత్తిపోసే అవకాశం ఉంటే.. రాజకీయ ద్వేషంతో కళ్లు మూసుకున్న రేవంత్ రెడ్డి బుద్ధితక్కువ వాడివో కాదో చెప్పాలన్నారు. అలాగే మేడిగడ్డ వద్ద 97 మీటర్ల ఎత్తులో నీళ్లు పోతుంటే కళ్లు ఉండి చూడలేని నువ్వు బుద్ధితక్కువ వాడివా.. లేదా వాస్తవాలు
చూపించే మేము తెలివి లేనివాళ్లమో చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం వల్ల మునిగే భద్రాచలాన్ని పట్టుకొని మేడిగడ్డ వల్ల మునిగిపోతుంది అంటున్న నీకు బుద్రలేదు.. అంటూ మండిపడ్డారు. రైతాంగం మొత్తం కన్నెపల్లి నుండి నీళ్లు ఇవ్వమంటే పట్టించుకోని వాడిని బుద్ధితక్కువ వాడు అనాలా లుచ్చా అనాలా..? అని కేటీఆర్ ఫైర్ అయ్యారు. గురువు కోసం నీళ్లు కిందకి వదులుతున్నావా..? అని రైతులు అడిగితే దానికి సమాధానం చెప్పే దమ్ము లేని దద్దమ్మ అనాలా, దరిద్రుడు అనాలా, ఏమనాలో చెప్పాలని కేటీఆర్ అడిగారు.

# నరహంతకుడిని పట్టుకోండి

**పోలీస్ స్టేషన్ ముందు గ్రామస్థుల ధర్నా**
**ఎమ్మెల్యే కాలే యాదయ్యను నిలదీసిన ప్రజలు**
**ఎస్ఐ సస్పెన్షన్.. నిందితుడి ఆచూకీ కోసం 2లక్షల రివార్డు**

రంగారెడ్డి జిల్లాలో ఆరుగురిని హత్య చేసిన నిందితుడిని అప్పగించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే కాలే యాదయ్యను ఆందోళనకారులు అడ్డుకున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, బాధితులను ఆదుకోవాలని ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగారు. పోలీసుల వైఖరిని ఖండిస్తూ స్థానికులు నినాదాలు చేశారు. జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి షాబాద్ పీఎస్ వద్దకు చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. షాబాద్‌లో బాధితులను కలిసి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ సంఘీభావం తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఐ, ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల బంధువులు షాద్‌నగర్-కంది రహదారిపై బైఠాయించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయమేర్పడింది. ఇదిలావుంటే ఆరుగురు దారుణ హత్యకు గురైన ఘటనపై పోలీసులు కీలక ప్రకటన చేశారు. నిందితుడు రాజ్‌కుమార్‌పై రూ.2 లక్షల రివార్డు ప్రకటించారు. అతడి ఆచూకీ తెలిపిన వారికి ఈ మొత్తాన్ని అందజేస్తామన్నారు. ఈ ఘటనలో షాబాద్ ఎస్సై రమేశ్‌ను సస్పెండ్ చేసినట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి వెల్లడించారు. ఈ కేసులో నిర్లక్ష్యం వహించిన అందరిపైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అండగా ఉంటామన్నారు. మరోవైపు పరారీలో ఉన్న నిందితుడి కోసం 10 ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ దృశ్యాలు, టోల్‌ప్లాజా వివరాల ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేశారు. దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్ కుమార్ కట్టుకున్న భార్య, ఇద్దరు కుమారులతో పాటు, తనపై పోక్సో కేసు పెట్టిన మైనర్ బాలిక, ఆమె తల్లి లక్ష్మీ, నాయనమ్మ రుక్కమ్మలను కత్తితో నరికి చంపిన విషయం తెలిసిందే. అనంతరం బాలికను దైవాల గూడ సమీపంలోని అఖిల్ సాగర్ చెరువు సమీపంలోకి తీసుకెళ్లి పీక కోసి హత్య చేశాడు. అనంతరం దైవాలగూడలోని తన ఇంటికొచ్చి భార్య సరిత (33)తో పాటు ఇద్దరు కుమారులు పరీక్షిత్ (4), దైవీక్షిత్ (2)లను కత్తితో పీకలు కోసి దారుణంగా హతమార్చాడు.

# వియత్నాంలో ఘోర ప్రమాదం

- **పర్యాటక బోటు బోల్తా పడి 19మంది జలసమాధి**
- **పలువురు పరిస్థితి విషమం..ఆస్పత్రిలో చికిత్స**
- **విహార యాత్రకు వెళ్లిన తెలుగువాలో పలువురు మృతి**
- **మృతుల్లో కడప, మచిలీపట్నంలకు చెందిన వారు**
- **రంగంలోకి దిగిన భారత ఎంబసీ.. హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు**

వియత్నాంలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఫు క్వాక్ ద్వీపం సమీపంలో భారతీయ పర్యాటకులతో వెళ్తున్న బోటు ఒక్కసారిగా తీవ్రమైన అలలకు బోల్తా పడింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 19 మంది తెలుగు పర్యాటకులు జలసమాధి అయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన సహాయ బృందాలు రక్షణ చర్యలు చేపట్టారు. స్థానిక అధికారులతో కలిసి నేవీ సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఇందులో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. భారత కాలమాన ప్రకారం ఉదయం 11: 30 గంటలకు బోటు ప్రమాదం జరిగినట్లుగా తెలుస్తోంది. ఓ మొబైల్ కంపెనీ తరఫున డీలర్స్ టూరిస్టులుగా వెళ్లారు. ఏపీ నుంచి 30, తెలంగాణ నుంచి 45 మంది వెళ్లారు. ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ కూడా లైఫ్ జాకెట్లు వేసుకోలేదని తెలుస్తోంది. ఇక మృతుల వివరాల కోసం అధికారులు హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేశారు. బాధిత కుటుంబాలు కంట్రోల్ రూమ్‌లను సంప్రదించవచ్చని, ఎలాంటి సహాయానికైనా, సందేహాలకైనా తాము అందుబాటులో ఉన్నామని భారత మిషన్ తెలిపింది. మొత్తం బోటులో 75 మంది భారతీయులు ఉండగా.. ఎక్కువగా తెలుగు రాష్ట్రాలకు చెందినవారు, తమిళనాడు వాసులు చనిపోయినట్లుగా తెలుస్తోంది. అయితే వారి పూర్తి వివరాలు, స్వస్థలాలు, కుటుంబ సభ్యుల సమాచారం సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. భారత రాయబార కార్యాలయం కూడా వియత్నాం అధికారులతో సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. బోటు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ప్రతికూల వాతావరణ
పరిస్థితులా, సాంకేతిక లోపమా, లేక మరే ఇతర కారణమా అన్న కోణంలో అధికారులు విచారణ చేపట్టారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి. ఈ విషాద ఘటనతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. తెలుగు రాష్ట్రాల్లోని బంధువులు, స్నేహితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం అధికారికంగా ధ్రువీకరించింది. ప్రస్తుతం స్థానిక అధికారులు ఘటనా స్థలంలో ముమ్మరంగా గాలింపు, సహాయక చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన కచ్చితమైన వివరాలు, బోటులో మొత్తం ఎంతమంది పర్యాటకులు ఉన్నారు.. వారి ప్రస్తుత పరిస్థితి ఏమిటన్నది ఇంకా పూర్తిగా తెలియరాలేదు. ఈ ఘటనపై భారత రాయబార కార్యాలయం సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో స్పందిస్తూ.. 'ఓ విషాదకరమైన ఘటనలో, కొన్ని గంటల క్రితం వియత్నాంలోని ఫు క్వాక్ ద్వీపం సమీపంలో పలువురు భారతీయ పర్యాటకులతో వెళ్తున్న బోటు బోల్తాపడింది. స్థానిక అధికారులు రెస్క్యూ ఆపరేషన్లు కొనసాగిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నాం' అని పేర్కొంది. ప్రమాదానికి గురైన పర్యాటకుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు, అవసరమైన సహాయం చేయడానికి భారత ప్రభుత్వం వియత్నాంలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటుచేసింది. ప్రమాద సమయంలో బోటులో సుమారు 30 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన సుమారు 18 మంది మరణించినట్లు సమాచారం. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కిషోర్ కుటుంబం కూడా ఈ విహారయాత్రలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో కిషోర్ భార్య మరణించగా, అపస్మారక స్థితిలోకి వెళ్లిన కిషోర్‌ను స్థానిక ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. స్థానిక అధికారుల సహాయక చర్యలు పూర్తిగా ముగిసిన అనంతరం ఈ వివరాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కడప జిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటర్ శ్రీధర్, మచిలీపట్నంకు చెందిన జయశ్రీ మరణించారు. కడపకు చెందిన మరో డిస్ట్రిబ్యూటర్ నయీం ఒడ్డున ఉండటంతో ప్రాణాలు దక్కించుకున్నారు. ట్రిప్‌లో భాగంగా వీరు మూడు పడవల్లో సముద్రంలో విహార యాత్రకు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో హాన్ మే రుట్ నుంచి అన్‌థోయ్ పోర్టుకు ఒక స్పీడ్ బోట్ బయల్దేరింది. అందులో 32 మంది భారతీయులు, నలుగురు సిబ్బంది ఉన్నారు. ఈ పడవ తీరానికి 400 మీటర్ల దూరంలో ఉండగా.. సముద్రంలో ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో ప్రయాణికులు నీటిలో మునిగిపోయారు. ప్రమాదం జరిగిన వెంటనే గమనించిన సమీపంలోని ఇతర పర్యాటక బోట్ల నిర్వాహకులు.. అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే, బోటు పూర్తిగా తలకిందులు కావడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. అటు అలల ఉధృతి కూడా తీవ్రంగా ఉండటంతో టూరిస్టులను కాపాడటం కష్టంగా మారింది. వీరిలో కొందరిని రెస్క్యూ సిబ్బంది రక్షించి ఆసుపత్రికి తరలించారు. మరికొందరు గల్లంతవ్వగా వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వాతావరణ మార్పుల కారణంగానే బోటు మునిగినట్లు తెలుస్తోంది.

## సిఎం రేవంత్‌తో ఎమిరేట్స్ ప్రతినిధుల భేటీ

మొదటి పేజీ తరువాయి
హైదరాబాద్‌లో ఎమిరైట్స్‌ఎ-38 సర్వీసులను ప్రారంభించేందుకు ఈ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సుముఖత వ్యక్తం చేశారు. ఎమిరైట్స్ విమాన సర్వీసులను మరిన్ని పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. తెలంగాణలో మరో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో అక్కడ కూడా ఎమిరైట్స్ ఆపరేషన్స్ కొనసాగించాలని సీఎం సూచించారు. విమాన సర్వీసులకు కావాల్సిన అన్నిరకాల సౌకర్యాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్శిటీలో క్రీడాకారులకు శిక్షణ అందించేందుకు స్పాన్సర్‌షిప్‌నకు ముందుకు రావాలని సీఎం కోరారు. ఈ విషయంపై ఎమిరైట్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సానుకూలంగా స్పందించారు.

## అబ్దిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందచేత

జగిత్యాల నియోజకవర్గంలోని పలువురు లబ్దిదారులకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్సీ ఎల్ రమణ శనివారం అందజేశారు. వివిధ కారణాలతో ఆస్పత్రిలో చికిత్స పొంది వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి కోసం జగిత్యాల నియోజకవర్గంలోని తొమ్మిది మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి మంజూరైన లక్షా యాభైవేల రూపాయల చెక్కులను ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ లబ్దిదారులకు ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో జగిత్యాల పట్టణ కౌన్సిలర్లు కోరుకంటి రాము, తోట హరీశ్, మాజీ జడ్పీటీసీ కొలుముల రమణ, రాయికల్ మండలం ప్రధాన కార్యదర్శి కొండపల్కల రత్నాకర్ రావు, వొళ్లాల గంగాధర్, గంగిపెల్లి వేణుమాధవ్, పెండెం గంగాధర్, చిరంజీవి, నందు నాయక్ పాల్గొన్నారు.

## కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయడం కుదరదు

మొదటి పేజీ తరువాయి

మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణంలో లోపాలు ఉన్నాయని.. 2020 మే 18వ తేదీన ఈఈ రమణారెడ్డి కేసీఆర్ ప్రభుత్వానికి లేఖ రాశారని ప్రస్తావించారు. లోపాలు సవరించాలని అప్పట్లోనే ఇంజినీర్లు సూచించారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యంతో లోపాలు పెరిగి పెద్దవై బ్యారేజ్ కుప్పకూలిందన్నారు. 2022 జులై 14వ తేదీన వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ దెబ్బతిందని చెప్పారు. ఇప్పటికీ కన్నెపల్లి పంప్‌హౌస్ వినియోగంలోకి రాలేదని తెలిపారు. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ప్రస్తావించారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుపై.. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే ఎన్డీఎస్ఏ కమిటీ ఏర్పాటు చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నీటి నిల్వకు అనుకూలం కావని ఎన్డీఎస్ఏ తేల్చిచెప్పిందని అన్నారు. ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణం, నిర్వహణ లోపాలపై.. గతంలోనే ఎన్డీఎస్ఏ కమిటీ నివేదిక ఇచ్చిందని ప్రస్తావించారు. ప్రాథమిక, తుది నివేదికల్లో ఎన్డీఎస్ఏ అదే విషయం చెప్పిందని అన్నారు. లోపాలు సవరించాలని నిపుణులు చెప్పినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. మొదట్లోనే స్పందించకపోవడంతో ఈ సమస్య పెద్దది అయిందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై పదేపదే అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## భారత్-న్యూజిలాండ్ బంధం మరింత బలోపేతం

మొదటి పేజీ తరువాయి
భారతీయుల ప్రతిభను గుర్తించి సరైన అవకాశాలు కల్పించే అద్భుత దేశం న్యూజిలాండ్ అని అన్నారు. ఎయిర్ న్యూజిలాండ్ సీఈఓగా నిఖిల్ రవిశంకర్, గవర్నర్ జనరల్‌గా ఆనంద్ సత్యానంద్, క్రికెట్‌లో రచిన్ రవీంద్ర, ఇష్ సోధి, అజాజ్ పటేల్ వంటి భారత సంతతి వ్యక్తులు రాణించడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. అలాగే ఆ దేశంలోని పలు ప్రాంతాలకు బాంబే హిల్స్, కోరమాండల్, కలకత్తా స్ట్రీట్, ఢిల్లీ క్రెసెంట్, అమృత్‌సర్ స్ట్రీట్ వంటి భారతీయ పేర్లుండటాన్ని ఇరు దేశాల మధ్య ఉన్న అనుబంధానికి సంకేతమని పేర్కొన్నారు. ఈ దేశంతో తనకు 30 ఏళ్ల అనుబంధం ఉందని గుర్తుచేసిన మోదీ.. రాజకీయాల్లోకి రాకముందే న్యూజిలాండ్‌ను సందర్శించే అవకాశం వచ్చిందని చెప్పారు. నాడు ఓ న్యూజిలాండ్ వాసి తనకు మఫ్లర్, టోపీ, గ్లౌజులు కానుకగా ఇచ్చిన విషయాన్ని స్మరించుకున్నారు. ఆ మఫ్లర్‌ను ఇప్పటికీ జాగ్రత్తగా భద్రపరుచుకున్నానని, అందులో న్యూజిలాండ్ దేశీయుల ప్రేమనూ అంతే ఆప్యాయంగా కాపాడుకుంటున్నట్టు చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ సహా ప్రభుత్వ ప్రతినిధులు, లేబర్ పార్టీ నాయకులకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. భారత్-న్యూజిలాండ్ బంధాలకు అక్కడి అన్ని రాజకీయ పార్టీలు మద్దతివ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లడంలో ఎన్ఆర్ఐల పాత్ర కీలకమని స్పష్టం చేశారు.

## సెమీకండక్టర్ రంగంలో మరో కీలక ముందడుగు

మొదటి పేజీ తరువాయి
రాష్ట్రాన్ని దేశంలోని ప్రముఖ సెమీకండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన చెప్పుకొచ్చారు. జపాన్‌తో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తూ అత్యాధునిక సెమీకండక్టర్ టెక్నాలజీ అభివృద్ధికి ఈ హబ్ వేదికగా నిలుస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. చిప్ తయారీ ప్రక్రియలో అత్యంత కీలకమైన సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ ఇకపై హైదరాబాద్‌లో అందుబాటులోకి రావడంతో దేశీయ సెమీకండక్టర్ పరిశ్రమకు ఊతం లభించనుంది. ఈ హబ్ ద్వారా విద్యార్థులు, స్టార్టప్‌లు, పరిశోధకులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణతో పాటు పరిశోధన, ఉత్పత్తి అభివృద్ధికి అవసరమైన సహకారం అందించనున్నారు. ఈ సందర్భంగా వచ్చే 18 నుంచి 24 నెలల్లో దేశీయంగా సీఎంపీ ప్యాడ్ల తయారీని ప్రారంభించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. సెమీకండక్టర్ తయారీకి అవసరమైన కీలక సాంకేతికతలను తెలంగాణలోనే అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పరిశోధన నుంచి నైపుణ్యాభివృద్ధి, ప్రోటోటైపింగ్, చిప్ తయారీ వరకు సమగ్ర సెమీకండక్టర్ ఎకోసిస్టమ్‌ను నిర్మించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు.

## ఆరుగురని దారుణంగా హత్య చేసిన సైకో

మొదటి పేజీ తరువాయి
దీంతో అరుణ్‌కుమార్ పోలీసులకు సమాచారం అందించారు. షాబాద్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనాస్థలిని ఫ్యూచర్‌సిటీ సీపీ తరుణ్ జోషి పరిశీలించారు. బాలికను వేధించాడని ఆమె తల్లి మే 16న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేసి రాజ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. బెయిల్‌పై తిరిగొచ్చిన నిందితుడు.. అర్ధరాత్రి ఈ దారుణానికి పాల్పడ్డాడు. నిందితుడు రాజ్‌కుమార్.. ఏడేళ్ల క్రితం సరితను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అయినా భార్యను ఇద్దరు పిల్లలను కూడా చంపడం అతని సైకో మనస్తత్వానికి నిదర్శనంగా చూడాలి. ఆరుగురి హత్య కేసులో మృతుల బంధువుల ఆందోళనతో షాబాద్‌లో ఉద్రిక్తత నెలకొంది. నిందితుడిని తమకు అప్పగించాలంటూ షాబాద్-కంది రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. రాజ్‌కుమార్‌ను వెంటనే అరెస్ట్ చేయకపోతే మరొకరి ప్రాణం తీస్తాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడు రాజ్‌కుమార్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, ఏడు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని ఫ్యూచర్‌సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు. నిందితుడు భార్య, పిల్లలను కూడా హత్య చేయడం పోలీసులను సైతం ఆశ్చర్యానికి గురి చేసిందని సీపీ తెలిపారు.

## బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా తెలంగాణ

మొదటి పేజీ తరువాయి
సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను ఆధునికంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా 1,300 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు చేపట్టామని వివరించారు. ఇప్పటికే 260 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పూర్తయ్యిందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణలో 40 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు నిధులు ఇచ్చామన్నారు. దేశంలో 7 బుల్లెట్ ట్రైన్స్ ప్రకటిస్తే.. అందులో తెలంగాణకు 3 దక్కాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కారణంగానే తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్స్ దక్కాయని వెల్లడించారు. ఇవి అందుబాటులోకి వస్తే.. హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం 1 గంట 10 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి ముంబైకి 2 గంటల 20 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి చెన్నయ్‌కి రెండు గంటల్లో వెళ్లవచ్చని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ దేశంలో పెద్ద మార్పునకు శ్రీకారం చుట్టబోతోంది. కొంతమంది దీని క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రెడిట్ కేవలం నరేంద్ర మోదీకి మాత్రమే దక్కుతుందని అన్నారు. 'వికసిత్ భారత్-2047' లక్ష్య సాధనలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని అశ్విని వైష్ణవ్ అన్నారు. వందేభారత్ రైళ్లు ప్రపంచస్థాయి సాంకేతిక ప్రమాణాలతో రూపొందించబడ్డాయని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. తెలంగాణకు ఇప్పటికే ఐదు వందేభారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయని, త్వరలో మరిన్ని సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు. గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా 36,000 కి.మీ. కొత్త రైల్వే ట్రాక్‌లు నిర్మించామని తెలిపారు. అలాగే 2,700 కి.మీ. డెడికేటెడ్ ÷-రెట్ కారిడార్ పూర్తి చేసినట్లు వెల్లడించారు. దేశంలోని రైల్వే నెట్‌వర్క్‌లో 99.4శాతం విద్యుద్దీకరణ పూర్తయిందని, దీంతో డీజిల్‌పై ఆధారపడటం దాదాపు పూర్తిగా తగ్గిపోయిందని చెప్పారు. తెలంగాణకు ఇప్పటికే ఐదు వందేభారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయని, త్వరలో మరిన్ని సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు.

## కావాలనే కన్నెపల్లి పంపులు తెరవడం లేదు

మొదటి పేజీ తరువాయి
గోదావరి నదిలో కావలసినన్ని నీళ్లు ఉన్నప్పటికీ, కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న ఈర్ష్యతో కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లను ప్రభుత్వం కావాలనే ఆన్ చేయడం లేదని విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం తిమ్మాయ్ పల్లి గ్రామంలో జరిగిన పెద్దమ్మ దేవాలయ ఉత్సవాల్లో హరీష్ రావు పాల్గొని మాట్లాడారు. సిద్దిపేట జిల్లా పెద్దమ్మ తల్లి రేవంత్ రెడ్డికి సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుకున్నట్లు వెల్లడించారు. ఎంతటి కరవు వచ్చినా రైతాంగానికి నీరందించేలా కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని, మోటార్లు ఆన్ చేస్తే రంగనాయక సాగర్ నిండి, సిద్దిపేట నియోజకవర్గంలోని దాదాపు 70 నుంచి 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని స్పష్టం చేశారు. కాళేశ్వరంతో ఒక్క ఎకరం కూడా పండలేదని వెల్లడించిన ముఖ్యమంత్రి తిమ్మాయిపల్లి గ్రామానికి వచ్చి ప్రజలతో మాట్లాడితే అర్థమవుతుందని అన్నారు. తిమ్మాయిపల్లిలో తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో ఎదురుచూసే పరిస్థితి ఉండేదని, కాళేశ్వరం జలాల రాకతో ఈ ప్రాంతం బంగారు పంటలతో కళకళలాడుతోందని సంతోషం వ్యక్తం చేశారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు నర్మెట ఫ్యాక్టరీ ద్వారా అద్భుతమైన ఆదాయం లభిస్తోందని తెలిపారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం జూలై 12, 2026

# అక్రమ సంబంధాలు ఎప్పుడూ సక్రమం కాదు

**బోయిన సత్యనారాయణ, అడ్వకేట్**

- **అక్రమ సంబంధం క్రిమినల్ నేరం కాకపోవచ్చు.**
- **అక్రమ సంబంధం అనైతిక ప్రవర్తన అవుతుంది.**
- **అనైతికత అన్ని అనర్థాలకు మూలం అవుతుంది.**

ప్రతి విషయాన్ని కోర్టు వరకు తీసుకురావడం చట్టబద్ధమైన అధికారం కావచ్చు... కానీ ఈ చట్టబద్ధ హక్కును నైతిక హక్కుగా పరిగణించగలమా? అనే చర్చ ప్రతి ఒక్కరిలో ఆందోళన లేపుతున్నాడు. అందరి మనసులలో తీవ్రంగా తర్జనభర్జన జరుగుతున్నది.

- **వివాహేతర అక్రమ సంబంధం క్రిమినల్ నేరం కాదు అనే అభిప్రాయంతో కొందరు తమ అనైతిక ప్రవర్తనకు సుప్రీం కోర్ట్ మద్దతు దొరికిందని భ్రమలో ఉన్నారు.**

అక్రమ సంబంధం విషయంలో సుప్రీంకోర్టు రెండు విభిన్నమైన తీర్పులను ఇచ్చింది. తీర్పుల నేపథ్యాన్ని కేసులలోని అంశాన్ని మనము తెలుసుకోవలసిన అవసరం ఉంది.

**జోసెఫ్ షైన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కు సంబంధించిన ఖై (Crl.) 194/2017** కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం, వివాహేతర అక్రమ సంబంధాన్ని క్రిమినల్ నేరంగా పరిగణించే చట్టాన్ని రద్దు చేసింది.

**అయితే, ఆ తీర్పు వివాహేతర సంబంధాలు నైతికంగా సమర్థనీయమైనవని లేదా కుటుంబ జీవితానికి ఆదర్శమని సుప్రీం కోర్టు చెప్పలేదు.**

అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ ఏకగ్రీవ తీర్పును ఇస్తూ భారత శిక్షాస్మృతి IPC సెక్షన్ 497 మరియు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ CrPC లోని సెక్షన్ 198(2) లను సుప్రీంకోర్టు రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేసింది.

- **ఈ పాత చట్టం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులైన ఆర్టికల్ 14 ప్రకారం సమానత్వ హక్కును, లింగ వివక్ష నిరోధం ఆర్టికల్ 15, మరియు ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కును, వ్యక్తిగత స్వేచ్ఛ మరియు గోప్యత లను ఉల్లంఘిస్తోందని మాత్రమే కోర్టు పేర్కొంది.**

ఈ తీర్పులను అడ్డం పెట్టుకుని తమ అనైతిక చర్యలను హక్కులుగా భావించే వారు ఆదర్శ కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు.
కానీ చట్టం విశాల భావాల ఆధారంగా పనిచేస్తుంది అనే విషయాన్ని అందరూ గమనించాలి. ఈ అక్రమ సంబంధం, గోప్యత అనే అంశానికి సంబంధిన ఇంకొక కేసులో సుప్రీం కోర్టు విభిన్నమైన ఇంకొక తీర్పు ఇచ్చింది.
సచిన్ అరోరా వర్సెస్ మంజు అరోరా కేసులో ఢిల్లీ హైకోర్టు కేసు నంబర్: CM(M)64/2023 న్యూట్రల్ సైటేషన్ నంబర్ 2023:DHC:3197 ద్వారా 10 మే, 2023 న జస్టిస్ రేఖా పల్లి ధర్మాసనం ఒక తీర్పు వెలువరించింది.
ఈ కేసు తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్ వేయడం జరిగింది.
ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ భర్త సివిల్ అప్పీల్ నంబర్ 400/2024 ద్వారా స్పెషల్ లీవ్ పిటిషన్ (సివిల్) నెంబర్ 11643/2023 తో సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.
ఈ అప్పీల్ పై తాజాగా సుప్రీంకోర్టు జస్టిస్ మన్మోహన్ మరియు జస్టిస్ కె. వినోద్ చంద్రన్ ల ధర్మాసనం తమ ఉత్తర్వు 02 జూలై, 2026 ద్వారా భర్త అప్పీల్‌ను పూర్తిగా కొట్టివేసింది.

- **ఈ తీర్పు ముఖ్యాంశాలు**

**గోప్యత హక్కు రక్షణ కవచం కాదు అని వివాహ బంధానికి వెలుపల పరస్పర అంగీకారంతో సాగించే లైంగిక సంబంధాలకు..ూాంబశ్రీవతీఎ కి రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద లభించే గోప్యత హక్కు సంపూర్ణ రక్షణ కవచంగా మారజాలదని కోర్టు స్పష్టం చేసింది.**


**ఫ్యామిలీ కోర్ట్స్ యాక్ట్, 1984 లోని సెక్షన్ 14 ప్రకారం వైవాహిక వివాదాలలో నిజాన్ని నిర్ధారించడానికి మరియు న్యాయం చేయడానికి ఏ రకమైన సాక్ష్యాధారాలనైనా సీల్డ్ కవర్‌లో స్వీకరించే విస్తృత అధికారాలు కోర్టులకు ఉంటాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.**

**గతంలో జోసెఫ్ షైన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2019) కేసు ద్వారా వివాహేతర సంబంధం.. Adultery అనేది క్రిమినల్ నేరం కాదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ, హిందూ వివాహ చట్టం ప్రకారం ఇది విడాకులు తీసుకోవడానికి ఇప్పటికీ బలమైన చట్టబద్ధమైన కారణమేనని కోర్టు పునరుద్ఘాటించింది.**

కాబట్టి, భాగస్వామి చేసిన ద్రోహాన్ని నిరూపించడానికి అవసరమైన డిజిటల్ లేదా థర్డ్-పార్టీ రికార్డులను కోర్టు ద్వారా సేకరించడాన్ని "వ్యక్తిగత గోప్యతకు భంగం" కలిగించడం గా భావించలేమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

- **చట్టం ఒక విశాలమైన లోతైన సముద్రం లాంటిది. చట్టం, హక్కు, న్యాయం అనే లోతులలోకి వెళ్లి చూడకుండా కోర్టు తీర్పులను ఇష్టానుసారంగా ఎవ్వరు కూడా తమకు అనుకూలంగా వర్తింప చేసుకోలేరు.**

అక్రమ సంబంధం గోప్యత అనే విషయంలో సుప్రీంకోర్టు రెండుసార్లు ఇచ్చిన విభిన్నమైన తీర్పులలో కాంట్రరీ వెతకకూడదు.
రెండు కేసులలోని విభిన్నమైనటువంటి ప్రేయర్ లను దృష్టిలో ఉంచుకొని కోర్టులు తీర్పులు ఇస్తాయి. కోర్టు తీర్పులు నేరానికి, వివాదానికి సంబంధించి మాత్రమే పరిమితమవుతాయి.
ఈ ఆర్టికల్ కోర్టుల తీర్పులపై వ్యాఖ్యానం కాదు. చట్టాన్ని విమర్శించడం లేదు.
నైతికత, సామాజిక బాధ్యత లేని జీవితాల వల్ల వ్యక్తులు, కుటుంబాలు, సమాజం దెబ్బతింటాయని మాత్రమే ఈ ఆర్టికల్ చెబుతున్నది.
నేడు సమాజంలో వివాహేతర సంబంధాల కారణంగా చోటుచేసుకుంటున్న కుటుంబ విభేదాలు, నమ్మకద్రోహాలు, విడాకులు, హింసాత్మక సంఘటనలు, ఆత్మహత్యలు, హత్యలు వంటి కొన్ని విషాదకర పరిణామాలను దృష్టిలో ఉంచుకొని మాత్రమే ఈ ఆర్టికల్ రాయబడింది.
ఈ ఆర్టికల్ ఏ ఒక్క వ్యక్తిని, కుటుంబాన్ని లేదా వర్గాన్ని ఉద్దేశించి రాయబడలేదు. ఇది సామాజిక సమస్యగా భావించి, సమాజంలో జరుగుతున్న కొన్ని సంఘటనల నుంచి నేర్చుకోవాల్సిన విలువలను గుర్తు చేయాలనే ఉద్దేశంతో మాత్రమే.




నైతిక ప్రవర్తన అనేది వ్యక్తికి స్వయం రాజ్యాంగం వంటిది.
దొంగతనంగా మొదలైన బంధం...అబద్ధాల మీద నిలిచిన అనుబంధం...మరొకరి కన్నీళ్లను చూసి నవ్విన ఆనందం ఎప్పుడూ సక్రమంగా ముగియదు...ఎందుకంటే ప్రకృతి తన నియమాన్ని ఎప్పుడూ మరచిపోదు.మార్చుకోదు.

- **మనం ఏ విత్తనం నాటితే...అదే పంట వస్తుంది. మోసం అనే విత్తనం నాటితే.. బాధ అనే పంట వస్తుంది.అబద్ధం అనే విత్తనం నాటితే..అవమానం అంటే పంట వస్తుంది.నమ్మక ద్రోహం అనే విత్తనం నాటితే..చివరికిఒంటరితనం అనే వేదనా భరిత పంట కోసు కోవాల్సి వస్తుంది.**

పౌర హక్కులకు భంగం కలిగినప్పుడు మాత్రమే చట్టం, కోర్టులు జోక్యం చేసుకుంటాయి.మనిషి నైతిక ప్రవర్తనను నిర్దేశించడం, నియంత్రించడం కోర్టుల పని కాదు.

- **చట్టం కోర్టులు సివిల్ కేసుల్లో న్యాయ తీర్పులు ఇస్తాయి. క్రిమినల్ కేసుల్లో శిక్షలు విధిస్తాయి.కానీ..మనిషి నైతిక ప్రవర్తన వ్యక్తిగత, సామాజిక అంశం.**

మనిషి ప్రపంచాన్ని మోసం చేయగలడు... కానీ తన మనసాక్షిని ఎప్పటికీ మోసం చేయలేడు. నైతికత అనేది మనిషి యొక్క ప్రవర్తన ను నియంత్రిస్తుంది...రాత్రి అందరూ నిద్రపోయినా మనసాక్షి మాత్రం మేల్కొని ఉంటుంది.

**రహస్యమైన ఆనందం కోసం మీ కుటుంబ గౌరవాన్ని పణంగా పెట్టొద్దు.మనస్సాక్షి అడిగే ప్రశ్న ఒక్కటే,నిన్ను ప్రాణం కంటే ఎక్కువగా నమ్మిన మనిషికి నువ్వు న్యాయం చేశావా? అని.**

ఆ ప్రశ్నకు సమాధానం చెప్పలేని జీవితం ఎంత ధనం ఉన్నా,ఎంత పేరు ఉన్నా అసంపూర్ణమే అవుతుంది.
ఒక మనిషిని,సమాజాన్ని నడిపించేది విలువలు మాత్రమే.చట్టం,కోర్టులు ఉన్నది ఆ ప్రవర్తనలో న్యాయ అన్యాయాలను నిర్ణయించి తీర్పులు ఇవ్వడానికి మాత్రమే. దాని అమలు బాధ్యత పాలనా వ్యవస్థ.

చట్టం ఉన్నది వ్యాజ్యాలు, కేసులు పెంచడానికి కాదు. కోర్టులు ఉన్నది కేవలం కేసులను నమోదు చేయడానికి కాదు.సమాజ పతనం పట్ల కోర్టులు మౌనంగా వేదన చెందుతూనే ఉంటాయి.ఈ నిశ్శబ్ద వేదన ఆయా వ్యక్తులను కూడా చెదలు పట్టినట్టు మెత్తగా తినేస్తాయి.అనైతిక ప్రవర్తన వల్ల తన కుటుంబానికి, సమాజానికి కీడు చేస్తుంది అని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.. దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని గురజాడ చెప్పినట్లుగా.. సమాజ బాటలో ప్రతి వ్యక్తి ఒక బాటసారి. వ్యక్తుల సత్ప్రవర్తన వల్ల మాత్రమే సమాజం సుసంపన్నం అవుతుంది.

- **ఒక మంచి వ్యక్తి మంచి కుటుంబాన్ని నిర్మిస్తాడు.**

**ఒక మంచి కుటుంబం ఒక మంచి గ్రామాన్ని,ఒక మంచి గ్రామం మంచి దేశాన్ని నిర్మిస్తుంది.కాబట్టి తప్పులు చేయడానికి,అనైతిక ప్రవర్తనకు చట్టాలను ఉపయోగించుకోకూడదు. చట్టాలను దుర్వినియోగం చేయకూడదు.చట్టం ఇదే కోరుకుంటుంది.**

రాజ్యాంగ హక్కులను,చట్టాలను కోర్టులు పరిశీలిస్తాయి.
ఒక మంచి నడవడికను నేర్పేది శాసన వ్యవస్థ మాత్రమే.అందుకే "యధా రాజ తథా ప్రజ" అనే నానుడి వినిపిస్తుంది.
రాజకీయ వ్యవస్థ కు అందరికంటే ఎక్కువ సామాజిక బాధ్యత ఉన్నది. రాజకీయ వ్యవస్థ అంటే శాసన వ్యవస్థ విఫలమైన నాడు సమాజం నిర్వీర్యం అవుతుంది.
సమాజ వైఫల్యం చట్టాలకు, కోర్టులకు వర్తించదు. అది పూర్తిగా శాసన వ్యవస్థకు, పాలనా వ్యవస్థకు సంబంధించిన విషయం.
వివాదాలను చట్టానికి,కోర్టులకు వదిలివేయకుండా నాయకులు, చట్టాలను రూపొందించే శాసన వ్యవస్థ,సామాజిక బాధ్యత ఉన్న సంఘాలు మాత్రమే ప్రజలకు విలువలు నేర్పాలి.

- **ఆలోచించండి.**

ఒక వ్యక్తి శారీరక ఆనందం కోసం అతని తల్లిదండ్రులు కన్నీళ్లు కారిస్తే అది సమర్థనీయం ఎలా అవుతుంది?. ఆ కన్నీళ్ళకు బాధ్యత ఎవరిది?
ఆడ వారి,మగవారి అనైతిక ప్రవర్తన వల్ల ఒక తల్లి కన్నీళ్లు కారిస్తే..ఒక తండ్రి తల వంచుకుంటే..ఒక భార్య లేదా భర్త గుండె పగిలిపోతే.. చట్టం చూస్తూ కూడా ఏమీ చేయలేదు.
అమ్మా నాన్న లు ఎందుకు గొడవ పడుతున్నారు?.. అమ్మా నాన్న లు ఎందుకు విడిపోయారు?..
ఎందుకు మమ్మల్ని అందరూ చులకనగా చూస్తున్నారు అని పిల్లలు అడిగితే సమాధానం చెప్పగలమా?.. సమాధానం ఎవరు చెప్పాలి?..

- **అక్రమ సంబంధం అనేది ప్రేమ కాదు.. అక్రమ సంబంధం ఒక మోహం,ఒక మోసం....ప్రేమ అనేది మనిషి గౌరవాన్ని పెంచుతుంది..అక్రమ సంబంధం గౌరవాన్ని పోగొడుతుంది. ముఖ్యంగా కుటుంబాన్ని సర్వ నాశనం చేస్తుంది.**

**ప్రేమ మనసులను కలుపుతుంది..అక్రమ సంబంధం కుటుంబాలను విడదీస్తుంది.ప్రేమ నమ్మకాన్ని నిర్మిస్తుంది..అక్రమ సంబంధం నమ్మకాన్ని సమాధి చేస్తుంది.**

అక్రమ సంబంధాల తో పోలీస్ స్టేషన్ ల చుట్టూ,కోర్టుల చుట్టూ తిరిగి వారి వారి హక్కుల కొరకు పోరాటం చేస్తారేమో గాని,కుటుంబాన్ని, నమ్మకాన్ని,గౌరవాన్ని పోగొట్టుకుంటారు.
ఈ మధ్యన కోర్టుల్లో విడాకుల కేసుల సంఖ్య పెరుగుతున్నది.దీనివల్ల కొందరికి ఉపాధి దొరుకుందేమో గాని కుటుంబాల విచ్ఛిన్నం, సామాజిక అశాంతి పెరుగుతుంది.

**పవిత్ర వైవాహిక బంధం బజారున పడకూడదు అని విజ్ఞులు కోరుకుంటున్నారు.**

ఈ ఆర్టికల్ చదివిన వారు ఇందులోని బాధతో మమేకమైతే అక్రమ సంబంధాలను, అసహజ సంబంధాలను కౌన్సిలింగ్ ద్వారా పరిష్కారం చేసి ఈ వివాదాలు బజారుకు ఎక్కకుండా చూస్తే చాలు.మంచి సమాజ నిర్మాణంలో పాలుపంచుకున్నట్టే.

- **ప్రేమ అంటే స్వార్థం కాదు త్యాగం... ప్రేమ అంటే మోసం కాదు నిజాయితీ...ప్రేమ అంటే ఉమ్మడి ఆస్తి...ఆ ప్రేమను కాపాడుకోవడమే ఉత్తమ పౌరుని లక్షణం...కోర్టులు కూడా ఇదే విషయాన్ని తీర్పులలో చెబుతాయి.**

కుల సంఘాలు, మత సంస్థలు,రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు ఈ అనైతిక అక్రమ సంబంధాలను నిర్మూలించే నైతిక ప్రవర్తనను నేర్పించాలి. ఉత్తమ సమాజ నిర్మాణానికి బాధ్యత తీసుకోవాలి.

అక్రమ సంబంధం మొదట కవ్విస్తుంది... చివరికి జీవితాంతం ఏడిపిస్తుంది. తమ శారీరక సుఖం కొరకు మానసిక ఆనందాన్ని దూరం చేసుకోవడం తప్పు అవుతుంది.
నమ్మకం పగిలితే నిశ్శబ్దం ఆవహిస్తుంది..కానీ ఆ బాధ జీవితాంతం వినిపిస్తూనే ఉంటుంది.

- **తప్పు దారిలో దొరికిన సంతోషం..సరైన దారిలో దొరికే మనశ్శాంతికి ఎప్పుడూ సాటిరాదు.**

కాబట్టి ఈ అక్రమ సంబంధాలను ప్రత్యక్షంగా పరోక్షంగా ఎవ్వరూ ప్రోత్సహించకూడదు. ఈ అక్రమ సంబంధ కేసులు కోర్టు వరకు రాకూడదు. మనిషి చేసిన ప్రతి పనిని చట్టం శిక్షించకపోవచ్చు కానీ కర్మ మాత్రం ఏ ఒక్కరినీ విడిచిపెట్టదు. కర్మ చట్టానికి సంబంధించిన అంశం కాదు.. ధర్మం న్యాయం అనేవి వ్యక్తిగత ఆదర్శానికి సంబంధించిన అంశాలు. ఈ పరిధులను అతిక్రమించిన నాడు వినాశనం తప్పదు.
నీ కుటుంబం నీ బలహీనత కాదు... అదే నీ బలం. దాన్ని కాపాడుకోవడమే నిజమైన గొప్పతనం.
అక్రమ సంబంధం ఎప్పుడూ నిజమైన విజయాన్ని ఇవ్వదు. అది చివరికి ఎవరో ఒకరి కన్నీళ్లను, ఎవరో ఒకరి విరిగిన విశ్వాసాన్ని, లేదా జీవితాంతం మోసే పశ్చాత్తాపాన్ని మిగుల్చుతుంది.
కానీ నిజాయితీతో నిలబెట్టుకున్న బంధం మాత్రమే మనశ్శాంతిని, గౌరవాన్ని, శాశ్వతమైన ఆనందాన్ని ఇస్తుంది.

**వ్యక్తి నిర్మాణం అనేది ఒక పవిత్రమైన కార్యం. వ్యక్తి నిర్మాణం, వ్యక్తి సంస్కరణ అనేది పౌరులందరి ఉమ్మడి బాధ్యత...ఇది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత**

## జూలై 24లోగా ఎన్యూమరేషన్ ఫారం సమర్పించాలి -- బడంగ్‌పేట్ సర్కిల్ అధికారులు

**మహేశ్వరం:బడంగ్‌పేట్, జూలై 11:కరపత్రం ప్రతినిధి ప్రతినిధి**

బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (Special Intensive Revision – SIR–2026) కార్యక్రమంపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రస్తుతం కొనసాగుతున్న SIR–2026 కార్యక్రమం పురోగతిని వివరించారు. ఓటరు జాబితాను సంపూర్ణంగా, ఖచ్చితంగా రూపొందించే లక్ష్యంతో భారత ఎన్నికల సంఘం ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. బడంగ్‌పేట్ AERO పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారం పూరించడంలో ఏవైనా సందేహాలు ఉన్నా, 2003 నాటి ఓటరు జాబితాకు సంబంధించిన వివరాలు తెలుసుకోవాలన్నా ఆయా హెల్ప్‌డెస్క్‌లలో అధికారులు, వాలంటీర్లు అవసరమైన సహాయాన్ని అందిస్తారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తిగా



పూరించి, సంబంధిత బూత్ లెవల్ అధికారి (BLO)కి జూలై 24లోగా తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. గడువులోగా ఫారం సమర్పించని పక్షంలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు వారి ఓటరు నమోదుపై ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. SIR–2026 కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఓటరు ఈ ప్రక్రియలో భాగస్వాములు అయ్యేలా మీడియా తమ వంతు సహకారం అందించాలని అధికారులు కోరారు. ఈ సమావేశంలో మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం--50 ఎన్నికల నమోదు అధికారి




(ERO) శ్రీ ఎన్. జగదీశ్వర్ రెడ్డి, బడంగ్‌పేట్ సర్కిల్--16 డిప్యూటీ కమిషనర్ / AERO శ్రీ వి. సమ్మయ్య, మహేశ్వరం నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శ్రీ యు. నరేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జాడి బాల్రెడ్డి ఆధ్వర్యంలో బండి సంజయ్ జన్మదిన వేడుకలు

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్**
కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ జన్మదినాన్ని పురస్కరించుకొని బిజెపి పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్రెడ్డి ఆధ్వర్యంలో 21వ డివిజన్ విద్యానగర్ వెంకటేశ్వర దేవాలయంలో కేంద్రమంత్రి బండి సంజయ్ పేరు పైన పూజలు అర్చన అనంతరం కార్పొరేటర్లు బోయిన్పల్లి ప్రవీణ్ రావు బండ రమణారెడ్డి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్లు బోయిన్పల్లి ప్రవీణ్ రావు ,బండ రమణారెడ్డి హాజరై మాట్లాడుతూ బండి సంజయ్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని అలాగే ఉన్నతమైన పదవులు చేపట్టాలని అన్నారు. జాడి బాలారెడ్డి మాట్లాడుతూ కేంద్రమంత్రి బండి సంజయ్ కార్యకర్త నుండి కౌన్సిలర్ కార్పొరేటర్ పార్లమెంట్ సభ్యులు కేంద్ర మంత్రిగా కష్టపడి ఉన్నత స్థానానికి చేరారు అలాగే ప్రజా సంగ్రామ యాత్ర పేరుతో పాదయాత్ర చేస్తూ పార్టీని తెలంగాణ రాష్ట్రంలో నలుమూలల వ్యాపింప వ్యాపింప చేశారన్నారు ఇట్టి కార్యక్రమంలో బిజెపి నాయకులు గుజ్జ శ్రీనివాస్, కర్రి అనిల్ ,సెన్సార్ ఫిలిం బోర్డ్ మెంబర్ నేలకొండ ప్రసన్నా రెడ్డి ,మాజీ పశ్చిమ జోన్ అధ్యక్షులు నరహరి లక్ష్మారెడ్డి, ఈ రెడ్డి తిరుమలరెడ్డి, గుండారపు సంపత్ ,దయ్యాల మల్లేశం, కొత్తపల్లి శంకర్ ,గోదారి నరేష్ ,బండ రాకేష్, లక్ష్మణ్ ఉప్పరపల్లి శ్రీనివాస్ చంద్రగిరి వేణు నేతరి ప్రవీణ్ నాంపల్లి శంకర్ కాసం సంతోష్ సృజన్ విష్ణు ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
ఆదివారం జూలై 12, 2026

## ప్రపంచ జనాభా దినోత్సవం పై అవగాహన



వైద్యాధికారి బురహాన్ సయ్యద్, సిబ్బంది

**పిడుగురాళ్ల, కరపత్రం ప్రతినిధి జూలై 11 :**
పిడుగురాళ్ల మండలం కరాలపాడులో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కరాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ బురహాన్ సయ్యద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ, తల్లి – శిశు ఆరోగ్యం కోసం ప్రతి ప్రాసవానికి మధ్య కనీసం 2–3 సంవత్సరాల విరామం పాటించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలలో ఉచితంగా అందుబాటులో ఉన్న కుటుంబ నియంత్రణ, బర్త్ స్పెసింగ్ పద్ధతులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాల్యవివాహాలు బాలికల ఆరోగ్యం, విద్య భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని, చిన్న వయసులో గర్భధారణ వల్ల రక్తహీనత, ప్రసవ సమస్యలు, తక్కువ బరువుతో శిశువుల జననం అంటే ప్రమాదాలు పెరుగుతాయని వివరించారు. బాల్యవివాహాలను అరికట్టి, బాలికల విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వేస్ట్ మెటీరియల్ తో బెస్ట్ ప్రొడక్ట్స్ తయారీ

విద్యార్థుల్లో సృజనాత్మకత ను పెంపొందించడ మే లక్ష్యం
ఆక్స్ఫర్డ్ స్కూల్ డైరెక్టర్ బొల్లా
గిరిబాబు వెల్లడి



**పిడుగురాళ్ల, కరపత్రం ప్రతినిధి జూలై 11 :**
పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలంలోని జానపాడు రోడ్డు నందు తిరుమల ఆక్సిఫోర్డ్ స్కూల్ నందు శుక్రవారం "వేస్టు మెటీరియలతో బెస్ట్ ప్రోడక్ట్" "పనికిరాని వస్తువులతో పిల్లలలో సృజనాత్మకతను బయట పెట్టుట ప్రోగ్రాం" అంగరంగ వైభవంగా జరిగింది. దీనిలో విద్యార్థినీ విద్యార్థులందరూ పాల్గొని ముందుగా పనికిరాని ప్లాస్టిక్ అట్ట ముక్కలుతో డ్రాయింగ్ వేసి అందరిని ఆశ్చర్యపరచారు."తిరుమల ఆక్సిఫోర్డ్ స్కూల్" డైరెక్టర్ బొల్లా గిరిబాబు అధ్యక్షతన మరియు స్కూల్ డీన్ అయినటువంటి ఏ.శ్రీనివాసరావు ప్రోత్సాహంతో "ఫెవిక్రైల్ హాబీ ఐడియాస్" వారు బి. వెంకటేష్ (టీ ఎస్ ఐ)మరియు పి. హరిబాబు (బీడీఈ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ డ్రాయింగ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు డీన్. ఏ. శ్రీనివాసరావు చేతుల మీదగా షీల్డ్స్ మరియు మెడల్స్ అందజేయడం జరిగింది. డీన్ మాట్లాడుతూ, చదువుతోపాటుగా ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొంటూ భవిష్యత్తులో అత్యున్నత స్థాయిలో ఉండాలని చెప్పి విద్యార్థిని విద్యార్థులును అభినందించారు. ఈ ప్రోగ్రాం ఇంతటి విజయవంతం కావడానికి కృషి చేసినటువంటి తిరుమల ఆక్స్ఫర్డ్ స్కూల్ వైస్ ప్రిన్సిపల్ భారతీ మరియు ఆర్ట్ టీచర్, మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల బృందాన్ని అభినందించారు.

## పల్నాడు జిల్లా నూతన అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బాధ్యతలు స్వీకరించిన రోహిత్ కుమార్ చౌదరి

**నరసరావుపేట, కరపత్రం ప్రతినిధి జూలై 11 :**



పల్నాడు జిల్లా నూతన అదనపు పోలీసు సూపరింటెండెంట్ (అడ్మిన్)గా 2022 బ్యాచ్కు చెందిన రోహిత్ కుమార్ చౌదరి, శనివారం నరసరావుపేటలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో నేరాల నిర్మూలన, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు వేగవంతమైన మరియు పారదర్శకమైన పోలీసు సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ, చట్టాన్ని కచ్చితంగా అమలు చేసే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రోహిత్ కుమార్ చౌదరి గతంలో గ్రేహౌండ్స్ విభాగంలో, అనంతరం తాడిపత్రిలో అదనపు ఎస్పీగా సేవలందించి, తాజాగా బదిలీపై పల్నాడు జిల్లాకు నియమితులయ్యారు. ఆయన బాధ్యతల స్వీకరణతో జిల్లా పోలీసు శాఖ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశాన్ని విజయవంతం చేయాలి: మందల రవీందర్ రెడ్డి


**కరపత్రం ప్రతినిధి భూపాలపల్లి .జూలై 11:**



ఈ నెల 17వ తేదీన హైదరాబాద్లో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశాన్ని తెలంగాణ ఉద్యమకారులందరూ విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర సహాయ కార్యదర్శి మందల రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు.ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ తొమ్మిది సంవత్సరాలుగా చేసిన నిరంతర పోరాట ఫలితంగానే ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమ పథకాల అమలు దిశగా ప్రభుత్వం గుర్తింపు కమిటీని ఏర్పాటు చేసిందన్నారు.ఈ నెల 17న హైదరాబాద్లోని సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్థూపంలోని అమర జ్యోతి ప్రాంగణంలో కే. కేశవరావు అధ్యక్షతన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాలకు చెందిన ప్రత్యేక తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారులు, ఉద్యమ సంఘాల ప్రతినిధుల నుంచి వినతిపత్రాలను కమిటీ స్వీకరిస్తుందని పేర్కొన్నారు.తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, ఉద్యమ సంఘాల నాయకులు, ఉద్యమకారులు తమ సలహాలు, సూచనలు, సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను కమిటీకి సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మందల రవీందర్ రెడ్డి కోరారు

# జమ్మికుంట భగవద్గీత జ్ఞాన మందిరంలో ఆధ్యాత్మిక వైభవం

శ్రీమద్భగవద్గీత 18 అధ్యాయాల మహా పారాయణం
-- భక్తిశ్రద్ధల నడుమ నక్షత్ర హారతి ఘనంగా
చిన్నారులతో పాటు భక్తులందరికీ అల్పాహార వితరణ
-- సేవా దాతలను అభినందించిన ఆలయ కమిటీ






**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 11:**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని భగవద్గీత జ్ఞాన మందిరంలో శనివారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీమద్భగవద్గీత 18 అధ్యాయాల సంపూర్ణ పారాయణాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పారాయణంలో పాల్గొని శ్రీకృష్ణ పరమాత్మ ఆశీస్సులు పొందారు.పారాయణ కార్యక్రమంలో మహిళలు, పురుషులు, యువత, చిన్నారులు ఎంతో భక్తి భావంతో పాల్గొని గీతా శ్లోకాలను పారాయణం చేశారు. ఆలయం అంతటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, గీతా పారాయణ ధ్వనులతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కార్యక్రమం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన నక్షత్ర హారతి అత్యంత వైభవంగా జరిగింది. దీపాల వెలుగులతో ఆలయం కళకళలాడగా, హారతి దర్శించుకున్న భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. శ్రీకృష్ణుని నామస్మరణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక కాంతిని సంతరించుకుంది. కార్యక్రమానికి హాజరైన భక్తులందరికీ, ముఖ్యంగా చిన్నారులైన భక్తులకు ప్రేమతో అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమానికి దొడ్డ వేణుగోపాల్, ప్రతిమ, సాంవేద్య, సాయి, శ్రీలత దాతలుగా వ్యవహరించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా సేవా దాతలను ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందిస్తూ, వారి సహకారం వల్ల కార్యక్రమం విజయవంతంగా నిర్వహించగలిగామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలకు భక్తులు ఇదే విధంగా సహకరించాలని కోరారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భగవద్గీత పారాయణ బృందం, మహిళా భక్తులు, యువత, చిన్నారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. శ్రీమద్భగవద్గీత బోధనలు ప్రతి ఒక్కరి జీవితానికి మార్గదర్శకమని, గీతా పారాయణం ద్వారా మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక చైతన్యం లభిస్తుందని పలువురు భక్తులు పేర్కొన్నారు.

## ఫీజు రీయింబర్స్మెంట్ ఎత్తివేత కుట్రను అడ్డుకుంటాం.. జూలై 14న రాష్ట్రవ్యాప్త కళాశాలల బంద్:

ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు గోస్కుల అజయ్
పేద విద్యార్థుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం..
రేవంత్ సర్కార్ వైఖరికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త ఆందోళనకు పిలుపు



**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్, జూలై 11:**
తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఉన్నత విద్యకు భరోసాగా నిలిచిన ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర నాయకుడు గోస్కుల అజయ్ ఆరోపించారు. ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 14న రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు అన్ని కళాశాలల బంద్కు ఏబీవీపీ పిలుపునిచ్చిందని ప్రకటించారు.హుజురాబాద్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్లపై ఆధారపడి చదువుకుంటున్నారని, అయితే ప్రభుత్వం బకాయిలను విడుదల చేయకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రస్తుతం రూ.11 వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పేరుకుపోయాయని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రతి ఏడాది లక్షలాది మంది విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం సకాలంలో ఫీజులు చెల్లించకపోవడంతో వేలాది మంది విద్యార్థులు తమ విద్యా సర్టిఫికెట్లు పొందలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ పరిస్థితుల కారణంగా పలువురు విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల సమయంలో ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించి, గ్రీన్ ఛానెల్ ద్వారా ప్రతి నెల ఫీజులు విడుదల చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ హామీలను నిలబెట్టుకోలేదని విమర్శించారు.ప్రైవేట్ కళాశాలలు, ప్రభుత్వం కలిసి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని, బడ్జెట్ కళాశాలలు కూడా మూతపడే పరిస్థితి వచ్చిందన్నారు. ఉపాధి కోసం లెక్చరర్లుగా పనిచేస్తున్న నిరుద్యోగులు ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపించారు."ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్లు విద్యార్థుల హక్కు.. ప్రభుత్వం ఇచ్చే దానం కాదు" అని స్పష్టం చేసిన అజయ్, తమ హక్కుల కోసం ప్రశ్నించే విద్యార్థులపై లాఠీచార్జీలు, అక్రమ కేసులు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర కలిగిన విద్యార్థి సమాజం అన్యాయాన్ని సహించదని హెచ్చరించారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేసి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జూలై 14న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త కళాశాలల బంద్ను విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెరుగు అభిలాష్, నగర సంయుక్త కార్యదర్శి రామ్ చరణ్, రాజు, నగర ఉపాధ్యక్షులు సాయి చరణ్, సాత్విక్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

# కష్టపడి చదువుకొని జీవితంలో పైకి రావాలి

గోదావరిఖని ఏసిపి మడత రమేష్



**కరపత్రం ప్రతినిధి మంథని జూలై 11**
మంథని:మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని చెడు వ్యసనాలకు లోను కావద్దని గోదావరిఖని ఏసిపి మడత రమేష్ పేర్కొన్నారు. శనివారం మంథని పట్టణం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాల (బాలురు)లో పెద్దపెల్లి జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల సమన్వయ సంస్థ అధికారి, ప్రిన్సిపల్ శ్రీనాథ్ అధ్యక్షతన తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గోదావరిఖని ఏసిపి మడత రమేష్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు తల్లిదండ్రులు తమ జీవితం పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. తల్లిదండ్రులు విద్యార్థుల ప్రవర్తనను ఎల్లప్పుడు గమనించాలని పేర్కొన్నారు. సోషల్ మీడియా ప్రభావం తమ పిల్లలపై పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. జీవితంలో కష్టపడి చదువుకుంటేనే ఉన్నత స్థాయికి చేరుకుంటామని ఆయన పేర్కొన్నారు. గురుకులాలలో అత్యున్నత స్థాయిలో విద్యార్థులకు బోధన అందించేందుకు అర్హత గల ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గురుకులాలను నడిపిస్తుందని, యువత కేవలం విద్య మీదనే దృష్టి సారించాలని ఆయన సూచించారు. డ్రగ్స్, మత్తు పదార్థాలుకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. మత్తు పదార్థాలు జీవితాన్ని నాశనం చేస్తాయని, తాత్కాలిక ఆనందం కోసం ఉజ్వలమైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులకు ప్రత్యేక సమావేశం ద్వారా ఏసీపి మడత రమేష్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మంథని సీఐ బుద్దే స్వామి, ఎస్సై సందీప్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ నవీన్, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ రాజ్ కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేత్రదాత కొంక నర్సయ్య సంస్మరణ సభ ఘనంగా నిర్వహణ

నేత్ర, అవయవ, శరీర దానాలపై అవగాహన
కల్పించిన సదాశయ ఫౌండేషన్



**కరపత్రం ప్రతినిధి వీణవంక, జూలై 11:**
కరీంనగర్ జిల్లా వీణవంక మండలం ఘన్ముకుల గ్రామంలో ప్రముఖ నేత్రదాత కొంక నర్సయ్య సంస్మరణ సభను శనివారం వారి నివాసంలో కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి అధ్యక్షత వహించగా, జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, నేత్రదాత కొంక నర్సయ్య చేసిన సేవలు సమాజానికి ఆదర్శప్రాయమని కొనియాడారు. మరణానంతరం నేత్రదానం, అవయవదానం, శరీరదానం ద్వారా ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపవచ్చని పేర్కొంటూ, కార్యక్రమానికి హాజరైన బంధుమిత్రులకు నేత్ర, అవయవ, శరీర దానాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.అనంతరం సదాశయ ఫౌండేషన్ తరపున ప్రత్యేక జ్ఞాపికను నేత్రదాత కొంక నర్సయ్య భార్య కొంక సత్యమ్మతో పాటు కుమార్తెలు, అల్లుళ్లు హరికృష్ణ--మణెమ్మ, ఇంద్రసేన--పద్మ, కొంక సతీష్లకు అందజేసి వారి కుటుంబాన్ని ఘనంగా సత్కరించారు. నేత్రదాత కుటుంబ సభ్యుల సేవా భావాన్ని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ గోదావరిఖని పట్టణ అధ్యక్షురాలు కొంక అన్నపూర్ణ మాట్లాడుతూ, కొంక నర్సయ్య కుటుంబాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. మరణానంతరం మట్టిలో కలిసిపోయే నేత్రాలు, అవయవాలు, శరీరాన్ని దానం చేయడం ద్వారా అనేక మంది జీవితాలకు ఉపయోగపడే అవకాశం ఉంటుందని, అలాంటి మహోన్నత సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు ఆకుల రాజేందర్, మేరుగు సారంగం, ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదె గుణసాగర్, కొంక ముత్తయ్యతో పాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థులు పాల్గొని నేత్రదాత కొంక నర్సయ్యకు ఘనంగా నివాళు లర్పించారు.